సాక్షి నల్లగొండ

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



కేసును ఛేదించిన పోలీసులు

నార్కట్‌పల్లి శివారులో హోటల్ ముందు బస్సులో నుంచి చోరీ చేసిన రూ.25 లక్షలను పోలీసులు రికవరీ చేశారు. - 8లో



ఆర్థిక ఫలాలు అందించాలి

భవిష్యత్ తరాలకు ఆర్థిక ఫలాలు అందించాలని కర్ణాటకలోని మాండ్య విశ్వవిద్యాలయం వీసీ శివచితప్ప అన్నారు. - 8లో



మృతదేహంతో ధర్నా

పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిడమనూరు స్టేషన్ ఎదుట ఓ బాధితులు తన తండ్రి మృతదేహంతో ధర్నా చేశారు. - 8లో

న్యూస్‌రీల్

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న జడ్జి దీప్తి

తిప్పర్తి: విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి అన్నారు. గురువారం తిప్పర్తి మండలం కేశరాజుపల్లి ఉన్నత పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి అనేది శరీరంలో ఏ భాగానికైనా రావచ్చన్నారు. రెండేళ్లకు ఒకసారి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులువు అవుతుందన్నారు. ఈ సదస్సుకు హాజరైన డీఎంహెచ్‌ఎం పుట్ల శ్రీనివాస్ ముందుగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ఈ సదస్సులో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ మమత, ఇన్‌చార్జి హెచ్‌ఎం సులోచన, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ అప్పగించాలి



మాట్లాడతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: పెండింగ్ సీఎంఆర్ చెల్లించని మిల్లర్లపై చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సీఎంఆర్, బ్యాంకు గ్యారంటీ తదితర అంశాలపై పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 2023–24 యాసంగికి సంబంధించి 9వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు చెల్లించాల్సి ఉందని, మార్చి 10లోగా చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, డీసీఓ పత్యానాయక్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ కొత్త ప్లాన్లు

రామగిరి(నల్లగొండ): దీర్ఘకాలికంగా రీచార్జ్ చేయకుండా ఇన్‌యాక్టివ్ 2, డియాక్టివ్ అయిన వినియోగదారుల కోసం బీఎస్‌ఎన్‌ఎల్ ప్రవేశపెట్టిన కొత్త ప్లాన్లను వినియోగించుకోవాలని సంస్థ జనరల్ మేనేజర్ పి.వెంకటేశ్వర్లు కోరారు. గురువారం నల్లగొండలో విలేకరులతో మాట్లాడారు. రూ.1,199కే ఏడాది పాటు ఏ నెట్‌వర్క్‌కు అయినా అపరిమిత కాల్స్, నెలకు 24జీబి డేటాతో పాటు రోజుకు 100 మేసేజ్‌లు లభిస్తాయన్నారు. స్పెషల్ టాప్ ఆఫ్ ఓచర్ రూ.1,39కి 28 రోజుల పాటు అపరిమిత కాల్స్‌తో రోజుకు 1.5 జీబి డేటా లభిస్తుందన్నారు. సమీపంలోని బీఎస్‌ఎన్‌ఎల్ సర్వీస్ సెంటర్, ఆన్‌లైన్ ద్వారా రీచార్జ్ చేసుకోవచ్చన్నారు.

సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లు పరిశీలన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 23న నిర్వహించే స్వర్ణ దివ్య విమాన గోపురం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా భద్రతా ఏర్పాట్లను గురువారం డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. ప్రధానాలయం, మాడ వీధులు, ఘాట్ రోడ్డు, యాగశాల ప్రాంతాలను పరిశీలించారు. భద్రతపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



అడవిదేవులపల్లిలో అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ



మిర్యాలగూడ మండలం బి.అన్నారంలో వీధిలో పారుతున్న మురుగునీరు



రాగడపలో సీసీ రోడు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు, పేరుకుపోయిన చెత్త

పల్లెల్లో పడకేసిన 'ప్రత్యేక' పాలన

- అందుబాటులో ఉండని అధికారులు
- రోడ్లపైనే పారుతున్న మురుగు నీరు
- ఏడాది కాలంగా ప్రజలకు తప్పని ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా రోడ్లపైనే బురదనీరు పారుతోంది. దీంతో దోమల బెడద పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వీధి దీపాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో బల్బులు వేయించే పరిస్థితి లేక చీకట్లోనే మగ్గాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. జిల్లాలోని 868 పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం గత ఏడాది ఫిబ్రవరిలో ముగిసిపోయింది. అప్పటివరకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రత్యేక అధి కారుల పాలనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే అప్పటి నుంచి గ్రా మాల్లో పాలన పడకేసింది. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సమస్యలు తిష్ట వేశాయి. దీనికి తోడు నిధుల లేమితో అభివృద్ధి పనులు కొనసాగక ప్రజలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు.

అక్కడక్కడా కార్యదర్శులు అప్పు చేసి పనులు చేయిస్తున్నా..

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో పరిస్థితి అధ్వానంగా మారడంతో గ్రామ కార్యదర్శులు అప్పులు చేసి పనులను చేయిస్తున్నారు. అయితే గతంలో కార్యదర్శులు చేయించిన పనులకు సంబంధించిన డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో కార్యదర్శి రూ.లక్ష వరకు అప్పు చేసి పనులను చేపట్టినా ఆ డబ్బులు ఇంతవరకు రాలేదని వాపోతున్నారు. వీధిలైట్లు, బోర్లు కాలిపోవడం, ట్రాక్టర్ల మరమ్మతులు, డీజిల్ ఖర్చులు అన్నీ భరించాల్సి వచ్చిందని, ఆ డబ్బులే ఇంకా రానప్పుడు ఎలా పనులు చేయిస్తామని ప్రశ్నిస్తున్నాయి. ప్రత్యేక అధికారులు అప్పుడప్పుడు వచ్చిపోతూ, సరిగ్గా పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

పేరుకుపోతున్న సమస్యలు

- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం బి.అన్నారం గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. వీధిలైట్లను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. అన్నారం గ్రామం నుంచి గద్దగూడుతండాకు వెళ్లే రోడ్డు కంపచెట్లతో నిండిపోయింది. వాటిని తొలగించేందుకు నిధుల్లేవని సిబ్బంది పేర్కొంటున్నారు. గ్రామానికి ప్రత్యేక అధికారి ఉన్నా ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.
- అడవిదేవులపల్లిలో మురుగు కాలువల్లో పూడిక తీయించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రత్యేక అధికారిని నియమించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.
- త్రిపురారం, కొండమల్లేపల్లి, గుర్రంపోడు మండలాల్లోని పలు గ్రామాలను ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని చోట్ల గ్రామాలకే రావడం లేదు. సర్వేల పేరుతో పట్టించుకోవడం మానేశారు. మురుగు కాలువలు శుభ్రం చేయించడం, వీధి దీపాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. వీదుల్లో చెత్తా చెదారం పేరుకు పోయి దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నాయి. ఎవరికి చెప్పుకోవాలే అర్థం కావడం లేదని వాపోతున్నారు.

రోడ్లపైనే మురుగు



గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపై పారుతోంది. పలు వీధుల్లో డ్రెయినేజీలు లేక రోడ్లపైనే మురుగునీరు చేరి దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

– జలగం యాకస్వామి కుక్కడం

పట్టించుకునే వారే లేరు



గ్రామంలో సమస్యలను పట్టించుకునే వారు లేకుండాపోయారు. గతంలో సర్పంచ్ ఉన్న సమయంలో వీధి లైట్లు, పారిశుద్ధ్యం సమస్యలను పరిష్కరించేవారు. ఏదైనా సమస్యను గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళితే, చిన్న పనులకు అప్పు చేసి పెడతామని, పెద్దవాటికి ఎలా అప్పు చేసి పెడతామని గ్రామ కార్యదర్శి చెబుతున్నారు. ప్రధాన రోడ్డు, సెంటర్లలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో మూల మలుపుల వద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

– సింగం సత్యనారాయణ, బి.అన్నారం, మిర్యాలగూడ

దోమలు పెరుగుతున్నాయి



మండల కేంద్రంలో సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఓవైపు డ్రెయినేజీ, మరోవైపు పారిశుద్ధ్యం లోపించడంతో విపరీతంగా దోమలు పెరిగాయి. ప్రజలకు ఇబ్బందిగా మారింది. ప్రత్యేక అధికారులు ఈ సమస్యలపై దృష్టి పెట్టాలి.

– పకీరయ్య, అడవిదేవులపల్లి



నిత్య పూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్వికులు

నేత్రపర్వం.. నీరాజన మంత్ర పుష్పం

యాదగిరి క్షేత్రంలో వైభవంగా మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం శ్రీస్వామి, అమ్మవారి తిరువీధి సేవోత్సవం కనుల పండువగా సాగింది. తిరువీధి సేవ యాగశాలకు ప్రవేశించిన అనంతరం ఇతిహాసాది పురాణ స్తోత్ర పారాయణాలు మూలమంత్ర హవనాలు, నిత్య పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పం చేపట్టారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ద్వారాది కుంభార్చన, మూర్తి మంత్ర హోమాలు, వారుణానువాక హోమం నిర్వహించారు. అనంతరం ఛాయాదివాసం, నిత్య పూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి వేడుకలు చేపట్టి స్వామి, అమ్మవారి సేవను ప్రధానాలయంలోకి చేర్చారు. వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి పాల్గొన్నారు.



రామానుజ జీయర్ స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్, ఏఎస్పీ

- నిరంతర నిఘా, తనిఖీలు పెంచాలి
- అధికారులను ఆదేశించి

నల్లగొండ: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నిరంతరం నిఘా, తనిఖీలు తీవ్రతరం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మైనింగ్, ఇరిగేషన్, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లలో అనుమతించిన వాహనాలు, అనుమతించిన వారికి మాత్రమే ఇసుకను తీసుకువెళ్లే అధికారం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద నైట్ విజన్ కెమెరాలతో పాటు, హైరిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన ఇసుక రీచుల వద్ద డ్రోన్ సర్వే సైతం చేయిస్తామన్నారు. పరిమితికి మించి ఇసుకను తవ్వించినా చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 24 రీచ్‌లలో ఇసుకను తీసేందుకు అనుమతి ఇవ్వడం జరిగిందని, వాటిని బలోపేతం చేస్తామన్నారు. నది లోతట్టు ప్రాంతాల్లో ఇసుక తవ్వడానికి వీలులేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా 31 గ్రామాలకు ఇసుకు రవాణాకు అనుమతులు ఇచ్చామని, ఆయా ఇళ్లకే ఇసుకను మంజూరు చేయాలన్నారు. అనుమతించిన ఇసుక రీచ్‌ల వద్ద, ముఖ్యంగా లోడింగ్ పాయింట్ల వద్ద సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే తవ్వేందుకు అనుమతి ఉంటుందన్నారు. ఆ తర్వాత ఎవరైనా లోడింగ్ పాయింట్ల వద్ద ఇసుకను తవ్వితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నాలుగు నెలల క్రితమే జాయింట్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో దేవరకొండ ఏసీపీ మౌనిక, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా మైన్స్ శాఖ సహాయ సంచాలకుడు జాకబ్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు

అనంతరం తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వేసవి కార్యాచరణ ప్రణాళికపై జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి పైపులు, నల్లాలు తదితర అత్యవసర మరమ్మతులు ఉంటే గ్రామ పంచాయతీ నిధులతో చేయించాలన్నారు. అవసరమున్న గ్రామాల్లో రైతులు వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని ప్రజలకు నీరందించాలన్నారు. రానున్న 150 రోజులకు ప్రణాళిక రూపొందించాలన్నారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ వంశీకృష్ణ, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి

- సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ



బీట్‌మార్కెట్‌లో కలెక్టర్‌తో చర్చిస్తున్న టీజీ సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ

నల్లగొండ: వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని టీజీ సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి నల్లగొండ పట్టణంలోని బీట్‌మార్కెట్‌లో జరుగుతున్న సబ్‌స్టేషన్ పనులను పరిశీలించారు. అనంతరం విద్యుత్ సరఫరాకు సంబంధించి వేసవి కార్యాచరణ ప్రణాళికపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఫిబ్రవరి 20 నాటికి జిల్లాలో 66 సబ్ స్టేషన్లపై ఓవర్ లోడ్ ఉండేదని, ఈసారి ఒక్క సబ్‌స్టేషన్ లో కూడా ఓవర్ లోడ్ లేదన్నారు. గత ఫిబ్రవరి చివరి నాటికి జిల్లాలో 966 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా, ఈసారి ఇప్పటికే 1000 మెగావాట్లు దాటిందని, అయినా ఎలాంటి ఓవర్ లోడ్ లేదన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి మార్చి 15 నాటికి 1,000 మెగావాట్లపైన విద్యుత్ అవసరం ఉండే అవకాశం ఉందని, ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మార్చి 31 వరకు ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని, విద్యుత్ అధికారులు అనుమతి లేకుండా కార్యస్థానాన్ని విడిచి వెళ్లొదన్నారు. నెట్‌వర్క్ మీద లోడ్ పెరగకుండా చూడాలని, ఎక్కడైనా బ్రేక్‌డౌన్ అయినా వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఇందుకు విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్న జిల్లా కలెక్టర్ లేదా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బడ్జెట్‌కు ఎలాంటి సమస్య లేదని లైన్లు, ఫీడర్లు, సబ్‌స్టేషన్లన్నింటికీ సహకారం అందిస్తామన్నారు. పలు విషయాలను అడిగితెలుసుకున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో వేసవిలో విద్యుత్ సమస్యను అధిగమించేందుకు ఇదివరకే విద్యుత్ అధికారులతో సమీక్షించామన్నారు. జిల్లాకు తొమ్మిది క్విక్ రెస్పాన్స్ టీం వెహికల్స్ ఇచ్చినందుకు సీఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, విద్యుత్ శాఖ డైరెక్టర్ ఎం.నరసింహ, సీఈ కమర్షియల్ భిక్షపతి, రూరల్ సీఈ బాలకృష్ణ, జిల్లా ఎస్సీ వెంకటేశ్వర్లు, జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు

నల్లగొండ టూటౌన్: ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా జిల్లా పరిధిలోని రెడ్ రిబ్బన్ క్లబ్ కళాశాలల్లో ఈనెల 24, 25 తేదీల్లో జిల్లా స్థాయిలో జాతీయ సేవా పథకం వలంటీర్లకు వ్యాసరచన, ఉపన్యాసం, నాటిక, పాటలు, పోస్టర్ డిజైనింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని జాతీయ సేవా పథకం మహాత్మాగాంధీ యూనివర్సిటీ సమన్వయ కర్త డాక్టర్ మద్దిలేటి తెలిపారు. గురువారం ఎంజీ యూనివర్సిటీలో నిర్వహించిన జిల్లాలోని వివిధ కళాశాలల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీలకు సిద్ధం కావాలని వలంటీర్లకు సూచించారు. సమావేశంలో ఎం.వెంకట్‌రెడ్డి, సుల్తానా షేక్, మీనాక్షి, డాక్టర్ ఆనంద్, శేఖర్, బి.విరస్వామి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్.రాజు, జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెళ్లొస్తాం..లింగమయ్యా



పెద్దగట్టు నుంచి మకర తోరణాన్ని సూర్యాపేటకు తరలిస్తున్న కోడి, వల్లపు వంశస్తులు

- ముగిసిన పెద్దగట్టు జాతర
- వైభవంగా మకరతోరణం తరలింపు

సూర్యాపేట/ చివ్వెంల: ఐదు రోజుల పాటు సాగిన పెద్దగట్టు జాతర గురువారం మకరతోరణాన్ని సూర్యాపేటకు తరలించడంతో ముగిసింది. ప్రతి రెండేళ్లకొకసారి వచ్చే చివ్వెంల మండలం దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి పెద్దగట్టు జాతర ఈనెల 16న ప్రారంభమై 20వ తేదీ వరకు వైభవంగా సాగింది. లక్షలాది మంది భక్తులు లింగమయ్యను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తులు, జోగినుల నృత్యాలు, డోలు చప్పుళ్లు, కటారు విన్యాసాలు, బైకాన్ల కథలు, ఓలింగ నామస్మరణతో సంప్రదాయ పద్ధతిలో జాతర నిర్వహించారు.

మకర తోరణం ప్రత్యేకత

జాతర ప్రారంభానికి ముందు శ్రీ లింగమంతుల స్వామి అలంకరణ కోసం సూర్యాపేట నుంచి కోడి, వల్లపు వంశస్తులు తెచ్చారు. ఈ తోరణాన్ని తిరిగి ఊరేగింపుగా సూర్యాపేటకు తరలించారు. అదే విధంగా లింగమంతుల స్వామి గుడిపైన ఉంచిన పసిడి కుండను దురాజ్‌పల్లి ఆవాసం ఖాసీంపేటకు చెందిన అలిశెట్టి వంశస్తులు జాతరకు ముందు తీసుకువచ్చి జాతర ముగియడంతో గురువారం తీసుకు వెళ్లారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చివ్వెంల(సూర్యాపేట): దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, కానుకలను గురువారం లెక్కించారు. 2023లో జరిగిన జాతరలో రూ.27,71,294 ఆదాయం రాగా.. ప్రస్తుతం రూ.31,29,686 వచ్చినట్లు ఆలయ ఈఓ కుశలయ్య తెలిపారు. గతంలో కంటే రూ.5.58 లక్షలు పెరిగినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 425 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, తహసీల్దార్ కృష్ణయ్య, దేవాదాయ శాఖ పరిశీలకురాలు సుమతి, ఈఓ కుశలయ్య, డైరెక్టర్లు వీరబోయిన సైదులు, కుర్ర సైదులు, మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన చిన్న మల్లయ్య, పోలెబోయిన నరేష్, సిరపంగి సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన జాతర

భానుపురి (సూర్యాపేట) : ఐదు రోజుల పాటు ఓ లింగా.. ఓ లింగా.. నామస్మరణతో మార్మోగిన పెద్దగట్టు జాతర గురువారంతో విజయవంతంగా ముగిసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ప్రకటించారు. శ్రీలింగమంతులస్వామి జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా అధికారులు, ఆలయ పాలకవర్గం సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేశారని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంగా పని చేశాయని, పోలీసు శాఖ అత్యాధునిక సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణను విజయవంతంగా నిర్వహించిందని పేర్కొన్నారు. పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పర్యాటక ప్రదేశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకున్నాయని తెలిపారు.

తుది దశకు 'టెన్త్ ఇంటర్నల్' మూల్యాంకనం

- 400కుపైగా స్కూళ్లలో ప్రత్యేక బృందాల పరిశీలన
- నేటితో పూర్తికానున్న ప్రక్రియ
- రేపటి నుంచి వెబ్‌సైట్‌లో మార్కుల వివరాలు నమోదు



పాఠశాలలో ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండ: జిల్లాలో పదవ తరగతి ఇంటర్నల్ మార్కుల మూల్యాంకన ప్రక్రియ తుది దశకు చేరింది. ఇంటర్నల్ మార్కుల కోసం ఈ నెల 17 నుంచి మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా 400కు పైగా స్కూళ్లలో మూల్యాంకన ప్రక్రియ పూర్తయింది. ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులు ఉండగా అందులో 80 మార్కులకు థియరీ పరీక్షల ద్వారా కేటాయిస్తుండగా మిగిలిన 20 మార్కులు ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించి మార్కులు కేటాయిస్తారు. జిల్లాలో మొత్తం 485 ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లు ఉండగా 18,666 మంది విద్యార్థులు టెన్త్ చదువుతున్నారు.

మూల్యాంకనానికి 69 టీమ్‌లు

జిల్లాలో పదవ తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలనకు జిల్లాలో 69 మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఒక హెచ్‌ఎంతోపాటు సబ్జెక్టు టీచర్, బాషా పండిట్ సభ్యులుగా నియమించారు. ఒక్కో బృందం 5 నుంచి 8 స్కూళ్ల వరకు పర్యవేక్షించి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల జాబితాలు పరిశీలిస్తోంది. ఈ బృందాలు ఎఫ్ఏ (ఫార్మటివ్ అసెస్‌మెంట్)–1 నుంచి ఎఫ్ఏ–4 వరకు ప్రతి పాఠ్యాంశానికి నిర్వహించిన పరీక్ష, ప్రాజెక్టు వర్క్, రీడింగ్, రైటింగ్ తదితర వాటికి ఐదు మార్కుల చొప్పున కేటాయిస్తాయి.

నేటితో మూల్యాంకనం పూర్తి

ఈ నెల 17న ప్రారంభమైన ఇంటర్నల్ మార్కుల మూల్యాంకన ప్రక్రియ శుక్రవారం పూర్తి కానుంది. అయితే ఇప్పటికే ఆయా పాఠశాలల క్లాస్ టీచర్ వాటిని పరిశీలించి మార్కులు కేటాయించారు. అయితే ఆయా ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా కేటాయించిన మార్కులు సరిగ్గా ఇచ్చారా లేదా అనేది బృందాలు పరిశీలిస్తున్నాయి. ఒకవేళ ఎక్కువ, తక్కువ ఉన్నా సరిచేయాలని సూచిస్తున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత విద్యార్థులకు కేటాయించిన మార్కులను 22 నుంచి బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్‌లో నమోదు చేయనున్నారు.

మూల్యాంకనం కొనసాగుతోంది

జిల్లాలో టెన్త్ విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ మార్కుల మూల్యాంకనం కొనసాగుతోంది. ఈ ప్రక్రియ శుక్రవారంతో పూర్తవుతుంది. దీని తర్వాత 22 నుంచి మార్కులను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషనల్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తాం.

– భిక్షపతి, డీఈఓ, నల్లగొండ



యాదాద్రి ఆలయంలో మహాకుంభాభిషేక సంప్రోక్షణలో భాగంగా ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న వానమామలై రామానుజ జీయర్ స్వామి







యాదగిరి క్షేత్రంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలతోనే మంచి గుర్తింపు



ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న వాసిరెడ్డి రామనాథం

ఖమ్మం వైద్యవిభాగం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం ద్వారా ఆస్పత్రులకు మంచి గుర్తింపు లభిస్తుందని పలువురు వైద్యులు అన్నారు. ఖమ్మం నెహ్రూనగర్‌లోని అఖిల కంటి ఆస్పత్రి ఏడో వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించగా డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఓపీ చాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అఖిల మాట్లాడుతూ.. నెలలు నిండకుండా జన్మించిన పిల్లల్లో రెటీనా సంబంధిత సమస్యలు ఎదురైతే వైద్యం అందించడం సంతృప్తిగా ఉందని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ మాధవి, మేనేజింగ్ డైరెక్టర్ కుతుంబాక మధుతో పాటు డాక్టర్ సమత, శ్రీధర్, సతీష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా క్రిష్ణానాయక్



నియామక పత్రం అందుకుంటున్న క్రిష్ణానాయక్

మఠంపల్లి: మఠంపల్లి మండలం గుర్రంబోడు తండాకు చెందిన హైకోర్టు అడ్వకేట్ భూక్యా క్రిష్ణానాయక్ హైకోర్టులో చేనేత వస్త్ర పరిశ్రమ సంస్థకు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రంఅందుకున్నట్లు గురువారం ఆయన పేర్కొన్నారు. కొంతకాలం సంగారెడ్డిలోని న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా ఆయన పనిచేశారు. క్రిష్ణానాయక్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు అభినందించారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తివేత

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతులస్వామి జాతర సందర్భంగా ఈ నెల 16వ తేదీ నుంచి హైదరాబాద్- విజయవాడ హైవేపై ఉన్న ట్రాఫిక్ ఆంక్షలను పోలీసులు ఎత్తివేశారు. జాతర గురువారం ముగియడంతో నార్కట్‌పల్లి, కోదాడ, టేకుమట్ల, బీబీగూడెం, రాఘవపురం గ్రామ స్టేజీ వద్ద ఉన్న ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేసి బారికేడ్లు తొలగించారు. దీంతో హైదరాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనదారులు యధాతథంగా వెళ్లవచ్చని సూచించారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- నార్కట్‌పల్లిలో ప్రైవేట్ బస్సులో నుంచి దొంగిలించిన రూ.25లక్షలు రికవరీ
- గ్యాంగ్‌స్టర్ మమ్మద్ అష్రఫ్ ఖాన్ అరెస్ట్
- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



రికవరీ చేసిన డబ్బును చూపుతున్న ఎస్పీ, పోలీస్ సిబ్బంది

నల్లగొండ: ఇటీవల నార్కట్‌పల్లి శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవే పక్కన హోటల్ ముందు ఆగిన ట్రావెల్స్ బస్సులో నుంచి చోరీ చేసిన రూ.25 లక్షలను పోలీసులు రికవరీ చేశారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఎన్నో దొంగతనాలను పాల్పడిన గ్యాంగ్‌స్టర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తన కార్యాలయంలో విలేకరుల వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు చెందిన బోయిన వెంకటేశ్వర్లు మౌరి టెక్ సంస్థ యాజమాని దామోదర్‌రెడ్డికి సంబంధించిన వ్యవసాయ భూమి అమ్మగా వచ్చిన రూ.25లక్షలను తీసుకుని చెన్నై నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో బయల్దేరాడు. నార్కట్‌పల్లి శివారులో హైవే పక్కన పూజిత హోటల్ వద్ద అల్పాహారం కోసం బస్సును డ్రైవర్ ఆపాడు. ఆ సమయంలో వెంకటేశ్వర్లు డబ్బులు ఉన్న బ్యాగును బస్సులోనే ఉంచి మూత్రవిసర్జన చేసేందుకు కిందకు దిగాడు. అతడు తిరిగి బస్సులోకి వచ్చేసరికి నగదు ఉన్న బ్యాగు కనిపించలేదు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాలుగు సీసీఎస్ బృందాలను ఏర్పాటు చేసి వారిని సమన్వయం చేస్తూ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన పోలీసులు బ్యాగు దొంగిలించిన వ్యక్తి కారులో వెళ్లినట్లు గుర్తించారు. కారులోని వ్యక్తుల ఫొటోల ఆధారంగా వారు మధ్యప్రదేశ్ రాష్ట్రం మన్సర్ తాలుకా కేద్వా జాగీర్‌లోని రాళ్లమండల్‌కు చెందిన ధార్ గ్యాంగ్ లీడర్ మమ్మద్ అష్రఫ్‌ఖాన్ ముల్తానీ షేక్, లైట్ ఖాన్, అక్రం ఖాన్, మహబూబ్‌ఖాన్‌గా గుర్తించారు. దీంతో పోలీసులు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో నిందితుల ఇళ్లపై దాడులు చేయగా అందులో ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. ప్రధాన నిందితుడిగా ఉన్న మహ్మద్ అష్రఫ్‌ఖాన్‌ను పట్టుకున్నారు. అతడి ఇంట్లో బస్సులో నుంచి దొంగిలించిన నగదుతో పాటు కర్ణాటకకు చెందిన కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి ఇక్కడకు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్, సీసీఎస్ ఎస్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో గురుకుల విద్యార్థుల స్నానాలు

- గురుకుల పాఠశాలలో నీటి వసతి సక్రమంగా లేకపోవడంతో బావుల వద్దకు వెళ్తున్న విద్యార్థులు



పొలాల వద్ద స్నానం చేస్తున్న ఎస్సీ బాలుర గురుకుల విద్యార్థులు

చిలుకూరు: చిలుకూరు మండలం నారాయణపురం గుట్టలో గల అక్షర పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో నీటి వసతి సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల చుట్టుపక్కల పొలాల్లోని బావులు, బోర్ల వద్దకు వెళ్లి స్నానాలు చేస్తున్నారు. ఈ గురుకుల పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉండగా.. గత వారం రోజులుగా 300 మందికి పైగా విద్యార్థులు చుట్టుపక్కల రైతుల పొలాల వద్దకు వెళ్లి స్నానాలు చేస్తున్నారు. ఇది గమనించిన రైతులు బావుల వద్ద గల విద్యుత్ మోటార్ల ఫ్యూజులు దాచుకొని వెళ్లినప్పటికీ, విద్యార్థులు స్వయంగా ఫ్యూజులు పెట్టుకొని మోటార్లు ఆన్ చేసుకుని స్నానాలు చేస్తున్నారు. తమ పొలాల వద్ద స్నానాలు చేయొద్దని చెప్పినా విద్యార్థులు వినకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని విద్యార్థులను కర్రలతో వెంబడించడంతో పరారైనట్లు రైతులు తెలిపారు. ఈ విషయాన్ని గురుకుల పాఠశాల సిబ్బందికి తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్నానాలు చేసే క్రమంలో విద్యార్థులు వరి పొలాలు మొత్తం తొక్కుతున్నారని, పొలాల్లోనే మూత్రవిసర్జన చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు బూర లక్ష్మీనారాయణ, కొండా సైదయ్య, కోటిరెడ్డి, బూర మల్లయ్య పేర్కొన్నారు.

స్వర్ణగిరిలో ఘనంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన త్రిదండి రామానుజ జీయర్‌స్వామి, నృసింహ భట్టర్ స్వామి

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం ఉదయం వైనతేయహవనం, ధ్వజారో హణం, అగ్నిప్రతిష్ఠ, మూర్తి కుంభారాధన, పల్లకీ సేవ, చిన్న శేషవాహనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దేవతాహ్వానం, పెద్ద శేషవాహనసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో త్రిదండి అహోబిలం రామానుజ జీయర్‌స్వామి, శ్రీరంగం ఆలయ ప్రథమ ఆచార్యులు శ్రీ పరాశరలక్ష్మీ నృసింహ భట్టర్ స్వామి పాల్గొన్నారు. శ్రీరంగం నుంచి తెచ్చిన శేష వస్త్రం, మాల అభయహస్తంను ఆలయ వ్యవస్థాపకుడు మానేపల్లి రామారావుకు అందజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థపక ధర్మకర్తలు మానేపల్లి మురళీకృష్ణ, గోపికృష్ణ, ప్రధాన అర్చకుడు శ్రవణ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఆర్థిక ఫలాలు అందించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న శివ చితప్ప, ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ తదితరులు

రామగిరి(నల్లగొండ): భవిష్యత్ తరాలకు మంచి ఆర్థిక ఫలాలు అందించాలని కర్ణాటక రాష్ట్రంలోని మాండ్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కె. శివ చితప్ప అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న నేషనల్ సెమినార్ గురువారం ముగిసింది. ఈ ముగింపుకు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కాంబ్లీ మాట్లాడుతూ.. మానవాభివృద్ధికి ఆర్థిక ఫలాలు దోహదపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి ప్రజలందరితో సమ్మిళితమై ఉండాలన్నారు. ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ.. నేషనల్ సెమినార్‌తో విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన సెమినార్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం సెమినార్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ డి. మునిస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆదె మల్లేశం, డాక్టర్ భట్టు కిరీటం, డాక్టర్ వెల్దండి శ్రీధర్, నర్సింగు కోటయ్య, జ్యోత్స్న, బొజ్జ అనిల్, అనిల్ అబ్రహం, ఎం. సుధాకర్, జాజుల దినేష్, నాగరాజు, హష్రత్, అంకుస్, కవిత, శిరీష, సావిత్రి, శంకరయ్య, నాగరాజు, పుణ్యవతి, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

- పందిరి వేసేందుకు చెట్ల కొమ్మలు కొడుతుండగా జారిపడి వృద్ధుడు మృతి



బాలయ్య (ఫైల్)

చింతపల్లి: మనవరాలి పెళ్లికి పందిరి వేసేందుకు చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం చింతపల్లి మండలం ధైర్యపురితండాలో జరిగింది. ధైర్యపురితండాకు చెందిన రామావత్ బాలయ్య(65) మనవరాలి వివాహం శుక్రవారం ఉదయం జరగనుండగా.. పందిరి వేసేందుకు గురువారం బాలయ్య తమ పొలానికి సమీపంలో చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పెళ్లింట విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతరకు వెళ్లొస్తుండగా..

- అదుపుతప్పి వాగులో పడిన బైక్
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

సూర్యాపేటటౌన్: పెద్దగట్టు జాతరకు వెళ్లొస్తుండగా.. బైక్ అదుపుతప్పి వాగులో పడిపోవడంతో ఒకరి మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. సూర్యాపేట మండలం కాసరబాద్ గ్రామానికి చెందిన సుధీర్ (21), సంపత్ బైక్‌పై దురాజ్‌పల్లి లింగమంతులస్వామి జాతరకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో సూర్యాపేట మండలం కేసారం సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు వెంట వాగులో పడింది. ఈ ప్రమాదంలో సుధీర్ అక్కడిక్కడే మృతిచెందగా, సంపత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన సంపత్‌ను సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

వ్యవసాయాధికారుల పాత్ర కీలకం

- నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

త్రిపురారం: వివిధ రకాల పంటల సాగులో రైతులను చైతన్యం చేయడంలో వ్యవసాయ అధికారుల పాత్ర కీలకమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం త్రిపురారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులకు అధిక సాంద్రత పత్తి సాగు, వివిధ రకాల పంటల సాగు పద్ధతులు, యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. వరి పంట పైనే ఆధారపడకుండా పంట మార్పిడి చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు పంటల సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడకుండా చూసుకోవాలన్నారు. అనంతరం కేవీకేలో గొర్రెలు, కోళ్లు, ఆవుల పెంపకం షెడ్లను పరిశీలించారు. వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ తోటల పెంచేలా అధికారులు రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆయిల్‌పామ్ తోటలకు ప్రభుత్వం అందించే సబ్సిడీల గురించి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ లింగయ్య, డాక్టర్ రాజాగౌడ్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా

- ఫిర్యాదు ఇచ్చినా కేసు నమోదు చేయలేదని ఆరోపణ



ఎస్ఐతో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

త్రిపురారం: పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతదేహంతో నిడమనూరు పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులు గురువారం ధర్నా చేశారు. నిడమనూరు మండలంమగుంతకల్ గ్రామానికి చెందిన గోపిశెట్టి శ్రీనివాస్(50) జనవరి 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరాడు. జనవరి 4న శ్రీనివాస్ కుమార్తె ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీనివాస్ గురువారం మృతిచెందాడు. పోలీసుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు శ్రీనివాస్ మృతదేహంతో గురువారం నిడమనూరు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఎస్ఐ గోపాల్‌రావు చెప్పినా ధర్నా విరమించలేదు. హాలియా సీఐ జనార్దన్‌గౌడ్ నిడమనూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు.

బస్సు టైరు కింద పడి వలస కూలీ మృతి

సూర్యాపేటటౌన్: ఆర్టీసీ బస్సు టైరు కింద పడి వలస కూలీ మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్ రోడ్డులో గురువారం సాయంత్రం జరిగింది. నకిరేకల్‌లో ఇటుక బట్టీల్లో పనిచేసే ఒడిశా రాష్ట్రం దబాంగ్ నవరంగపూర్ జిల్లా దమనగూడ గ్రామానికి చెందిన హల్దర్ భద్ర(20), అతడి స్నేహితులు నిరంజన్, నర్సింగ్, బోస్ సూర్యాపేటలో ఉంటున్న తమ స్నేహితుడు లచ్చం వద్దకు వచ్చి తిరిగి నకిరేకల్‌కు వెళ్తూ.. జనగామ క్రాస్ రోడ్డు వద్ద సూర్యాపేట నుంచి తుంగతుర్తి వెళ్తున్న పల్లె వెలుగు బస్సు ఎక్కారు. ఆ బస్సు నకిరేకల్‌కు వెళ్లదని తెలిసి భద్ర బస్సు దిగుతూ కింద పడగా టైరు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి స్నేహితుడు నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఒకరితో ప్రేమ.. మరొకరితో పెళ్లి

- ప్రేమించి మోసం చేశాడని ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా



నాగరాజు ఇంటి ఎదుట కుటంబ సభ్యులతో కలిసి ధర్నా చేస్తున్న తిరుమల

నాగారం: మూడేళ్ల నుంచి తనను ప్రేమించి.. చివరకు మరో యువతిని వివాహం చేసుకోవడంతో ప్రేమించిన యువతి గురువారం ప్రియుడి ఇంటి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ధర్నాకు దిగింది. ఈ ఘటన నాగారం మండలం లక్ష్మాపురం గ్రామంలో జరిగింది. బాధిత యువతి, ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపురం గ్రామానికి చెందిన మల్లేపాక నాగరాజు హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన సుంకరి తిరుమల అనే యువతి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన స్టాఫ్ నర్సుగా ఉద్యోగం చేస్తోంది. నాగరాజుకు తిరుమల సమీప బంధువు. అంతేకాకుండా నాగరాజు తల్లి అనారోగ్యానికి గురికావడంతో నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించిన సమయంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. తనను పెళ్లి చేసుకోవాలని తిరుమల పలుమార్లు నాగరాజుపై ఒత్తిడి చేయగా.. తొందర ఎందుకని, సూర్యాపేటలో ఉద్యోగం ఇప్పిస్తాను ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లి చేసుకుందామని దాటవేస్తూ వచ్చాడు. నాగరాజు తన బావ మనోజ్‌తో కలిసి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి తన వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారని తిరుమల ఆరోపించింది. మూడేళ్లుగా ప్రేమించుకుంటున్న విషయం తన తల్లిదండ్రులకు చెప్పగా వారు నాగరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడారని, నాగరాజు పెళ్లి విషయం గురించి గురువారం మాట్లాడదామని చెప్పడంతో లక్ష్మాపురం గ్రామానికి వచ్చామని బాధితురాలు తెలిపింది. నాగరాజు ఇంట్లో లేకపోవడంతో ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని, నాగరాజు మరో అమ్మాయిని వివాహం చేసుకొని ఫొటోలను తనకు వాట్సాప్ చేశాడని పేర్కొంది. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ నాగరాజు ఇంటి ఎదుట ధర్నాకు దిగినట్లు తిరుమల తెలిపింది. నాగరాజును కానిస్టేబుల్ విధుల నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని యువతికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



పెద్దగట్టు జాతరలో భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించేందుకు బయటకు తీస్తున్న ఆలయ సిబ్బంది



కుంకుమ, పసుపు అంటిన నోట్లను కడిగి ఇస్త్రీ చేస్తున్న సిబ్బంది



మకర తోరణాలను తరలిస్తున్న కోడి, వల్లపు వంశస్తులు



జాతరకు వచ్చి సెల్ఫీ తీసుకుంటున్న భక్తులు